సాక్షి అనంతపురం

శనివారం । 18 । మే । 2024



చీనీ టన్ను రూ.36,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36,500 పలికాయి. మార్కెట్‌కు 1,074 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



కళాఖండాలకు నిలయం

సాంస్కృతిక వారసత్వ సంపద, సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక కళాఖండాలను పదిలంగా సంరక్షిస్తోంది అనంతపురం మ్యూజియం. 10లో

గరిష్టం/కనిష్టం
37.3°/22.4°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత, వడగాల్పులు తీవ్రత స్వల్పంగా తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

వసతి గృహాల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తులు

అనంతపురం రూరల్: మైనార్టీ సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 2024–25విద్యా సంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ ఏడీ రామసుబ్బారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వసతి గృహాల్లో 6–10వ తరగతి వరకు వంద మంది మైనార్టీ బాలికలకు ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వసతి గృహానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండి, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 97039 42423 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జిల్లాకు 1,114 మెట్రిక్ టన్నుల యూరియా



ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ రవి

అనంతపురం అగ్రికల్చర్: జూన్ నుంచి మొదలు కానున్న ముంగారుకు ముందస్తుగా ఎరువులు సరఫరా అవుతున్నాయి. కోరమాండల్ కంపెనీ నుంచి 1,114 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరినట్లు ఏడీఏ ఎం.రవి తెలిపారు. ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా వచ్చిన యూరియాను శుక్రవారం ఏడీఏ పరిశీలించారు. కలెక్టర్, డీఏవో ఆదేశాల మేరకు ఆర్‌బీకే, సొసైటీలు, అలాగే ఇండెంట్ మేరకు ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. మిగతావి మార్క్‌ఫెడ్, కంపెనీ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు వెల్లడించారు.

నిలిచిన ఆర్టీఏ సేవలు



నిరీక్షిస్తున్న వాహనదారులు

అనంతపురం సెంట్రల్: రవాణా శాఖలో సర్వర్ పనిచేయకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. గత కొన్నేళ్ల కిందట ఆర్టీఏ సేవలు మొత్తం ఆన్‌లైన్ చేశారు. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ మెయింటెన్స్ చేస్తుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ పనిచేయడం లేదు. రెండు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో డ్రైవింగ్ లైసెన్స్‌లు, పర్మిట్‌లు, రిజిస్ట్రేషన్ సేవలు తదితర కార్యకలాపాలు నిలిచిపోయాయి. మూడు రోజుల వ్యవధిలో నిలిచిపోయిన కార్యకలాపాలన్నీ సోమ, మంగళవారాలకు వాయిదా వేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఎల్‌ఎల్‌ఆర్‌ల స్లాట్స్ కూడా వాయిదా వేసుకోవాలని ఆర్టీఓ సురేష్ నాయుడు తెలిపారు. శనివారం మధ్యాహ్నం నాటికి సర్వర్ పనిచేస్తుందని రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కార్యాలయం నుంచి సమాచారం వచ్చినట్లు వివరించారు. సోమవారం నుంచి యథావిధిగా కార్యాలయ సేవలు కొనసాగుతాయని తెలిపారు.

సిద్ధమవుతోన్న విద్యాకానుక

- ప్రభుత్వ పాఠశాలల్లో 1–10వ తరగతి విద్యార్థులకు 'జగనన్న విద్యా కానుక' కిట్లు
- వరుసగా ఐదో ఏడాది ఇచ్చేందుకు చకచకా ఏర్పాట్లు
- ఇప్పటిదాకా ఏడు మండలాలకు చేరిన నోట్‌బుక్స్
- బడి తెరిచే నాటికి విద్యార్థుల చేతుల్లో విద్యా కానుక కిట్లు
- జిల్లాలో 2,68,254 మంది విద్యార్థుల కోసం రూ. 44.26 కోట్ల ఖర్చు



అనంతపురం చేరిన నోట్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాదరావు, సెక్టోరియల్ అధికారులు గోపాలకృష్ణ, గోవిందరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరంలో పంపిణీ చేసేందుకు జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్లు సిద్ధమవుతున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే జూన్ 12 నాటికి విద్యార్థులకు అందజేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో కూలీనాలీ చేసుకుంటూ జీవనం సాగించే తల్లిదండ్రులు తమ పిల్లలను బడులకు పంపాలంటే ఆర్థిక ఇబ్బందులతో వెనుకడుగు వేసేవారు. పంపినా అరకొర ఖర్చులు కూడా భరించలేక చాలామంది పిల్లలు డ్రాపౌట్స్‌గా మారేవారు. అప్పట్లో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫాంను ప్రభుత్వం ఉచితంగా ఇచ్చేది. 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు మాత్రమే ఇచ్చేవారు. ఇక మిగిలిన నోట్ పుస్తకాలు, ఇతరత్ర వాటిని కొనుగోలు చేయాలంటే విద్యార్థుల తల్లిదండ్రులకు కష్టంగా ఉండేది.

విద్యకు జగన్ ఎనలేని ప్రాధాన్యత..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ విద్యకు ఎనలేని ప్రాధాన్యత ఇచ్చారు. నాడు–నేడు కార్యక్రమంతో ప్రతి ప్రభుత్వ పాఠశాలకూ రూ.లక్షలు వెచ్చించి మౌలిక వసతులు కల్పించారు. కొత్త భవనాలు, మరుగుదొడ్లు, తరగతి గదులు, పెయింటింగ్, ఫర్నీచర్ ఇలా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారు.

9 రకాల వస్తువులతో కిట్..

తల్లిదండ్రులపై పైసా భారం పడకుండా 9 రకాల వస్తువులతో కూడిన 'జగనన్న విద్యా కానుక' కిట్లను 1–10 తరగతుల విద్యార్థులకు అందజేస్తున్నారు. ఒక కిట్‌కు ప్రభుత్వం రూ.1650 ఖర్చు చేస్తోంది. ఈ కిట్‌లో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్ బుక్స్, ఆక్స్‌ఫర్డ్, పిక్టోరియల్ డిక్షనరీలు, బ్యాగు, మూడు జతల యూనిఫాం, షూ, బెల్ట్ ఉంటాయి. ఇప్పటికే నాలుగేళ్లు ఈ కిట్లను ఇచ్చారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో విడత జేవీకే కిట్లను అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 1–10 తరగతుల విద్యార్థులు

జగనన్న విద్యా కానుక కిట్ల కోసం వ్యయం ఇలా..		
సంవత్సరం	విద్యార్థులు	ఖర్చు (రూ. కోట్లలో)
2020-21	2,38,156	30.96
2021-22	2,12,540	35.06
2022-23	2,18,350	36.02
2023-24	2,22,212	36.66
2024-25	2,68,254	44.26

2,68,254 మంది ఉన్నారు. వీరికోసం రూ. 44.26 కోట్లు ఖర్చు చేసి జేవీకే కిట్లు అందజేస్తోంది. మొత్తంగా ఈ ఐదేళ్లలో విద్యాకానుక కిట్ల కోసం ప్రభుత్వం రూ.183 కోట్లు ఖర్చు చేసింది.

ప్రైవేట్‌కు దీటుగా 'ప్రభుత్వ' విద్యార్థులు..

ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు మాదిరిగానే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా యూనిఫాం, షూ, బెల్ట్ ధరించి ఈ నాలుగేళ్లు వెళ్లారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తున్నారు.

ఏడు మండలాలకు చేరిన నోట్‌బుక్స్..

జగనన్న విద్యా కానుక కిట్లలోని అన్ని వస్తువులు రాష్ట్ర కార్యాలయం నుంచి నేరుగా మండల కేంద్రాల్లోని గోడౌన్లకు తరలిస్తారు. అక్కడి నుంచి ఆయా పాఠశాలలకు సరఫరా చేయనున్నారు. ఏడు మండలాలకు నోట్ బుక్స్ చేరాయి. తక్కిన వస్తువులన్నీ రెండుమూడు రోజుల తర్వాత నుంచి రానున్నాయి.

పలు మండలాల్లో వర్షం



మడకశిరలో వర్షానికి జలమయమైన రోడ్డు

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో అక్కడక్కడా వర్షాలు పడుతున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు పలు మండలాల్లో వర్షం కురిసింది. శ్రీ సత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంట, గాండ్లపెంట, మడకశిర, తనకల్లు, అనంతపురం జిల్లాలోని బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, విడపనకల్లు మండలాల్లో పదును వర్షం కురిసింది. కదిరి, అమడగూరు, నల్లచెరువు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఆత్మకూరు, కంబదూరు, బెళుగుప్ప, గార్లదిన్నె, ఉరవకొండ, కూడేరు, గుంతకల్లు, పామిడి తదితర మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్ల వర్షం పడింది.

22 వరకు వర్షాలు..

జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం వాతావరణ బులెటిన్ విడుదల చేశారు. ఈ నెల 22 వరకు ఆకాశం ఎక్కువగా మేఘావృతమై మోస్తరు నుంచి తేలికపాటి వర్షసూచన ఉంటుందని పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 35 నుంచి 39 డిగ్రీలు, కనిష్టం 24 నుంచి 26 డిగ్రీలు ఉండవచ్చని తెలిపారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా మోస్తరుగా వర్షాలు కురిసినందున తేమను ఉపయోగించుకుని వేసవి దుక్కులతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలని తెలిపారు.

కౌంటింగ్‌కు విధివిధానాలు



ఓట్ల లెక్కింపునకు చేపట్టిన చర్యల గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న జాయింట్ కలెక్టర్

ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఇవే	
రాయదుర్గం	జేఎన్‌టీయూ మెయిన్ బిల్డింగ్ మొదటి ఫ్లోర్ నార్త్ వింగ్
గుంతకల్లు	జేఎన్‌టీయూ మెయిన్ బిల్డింగ్ మొదటి ఫ్లోర్ సౌత్ వింగ్
తాడిపత్రి	జేఎన్‌టీయూ మెయిన్ బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్ సౌత్ వింగ్
ఉరవకొండ	జేఎన్‌టీయూ ఎ-బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్
శింగనమల	జేఎన్‌టీయూ ఎ-బ్లాక్ మొదటి ఫ్లోర్
కళ్యాణదుర్గం	జేఎన్‌టీయూ ఎ-బ్లాక్ మొదటి ఫ్లోర్
అనంతపురం	జేఎన్‌టీయూ ఈసీఈ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్
రాప్తాడు	జేఎన్‌టీయూ ఈసీఈ బ్లాక్ మొదటి ఫ్లోర్

- మార్గదర్శకాలు నిర్దేశించిన ఎన్నికల సంఘం
- కేంద్రాల్లో సూపర్‌వైజర్లది క్రియాశీలక పాత్ర
- ఆర్‌ఓలు, ఏఆర్‌ఓల పర్యవేక్షణలో ప్రక్రియ
- జేఎన్‌టీయూలో కౌంటింగ్ కేంద్రాలు

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) జూన్ 4వ తేదీన జరగనుంది. ఓట్ల లెక్కింపునకు మార్గదర్శకాలను ఎన్నికల సంఘం నిర్దేశించింది. జేఎన్‌టీయూలో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను జిల్లా యంత్రాంగం చేపట్టింది. ఏర్పాట్లపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. కౌంటింగ్ ప్రక్రియలో సూపర్‌వైజర్లు క్రియాశీల పాత్ర పోషిస్తారు. ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు పర్యవేక్షక అధికారులుగా వ్యవహరిస్తారు. ఓట్ల లెక్కింపునకు నియమించిన అధికారులు, లెక్కింపు సిబ్బంది ఆరోజు తెల్లవారుజామున 4 గంటలకు హాజరవుతారు. ర్యాండమైజేషన్ పూర్తయిన తరువాత సిబ్బంది తమకు కేటాయించిన కౌంటింగ్ హాల్‌లోకి ప్రవేశిస్తారు. అనంతరం అక్కడి ఆర్‌ఓ, ఏఆర్‌ఓ సూచనలను స్వీకరిస్తారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభానికి ముందే ఆయా టేబుళ్ల వద్ద సామగ్రి ఉందా లేదా అనేది సూపర్‌వైజర్లు పరిశీలిస్తారు. సందేహాలు వస్తే నివృత్తి చేసుకుంటారు. కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి అంశంపై జాగ్రత్తలు తీసుకుంటూ ప్రక్రియ సజావుగా జరిగేలా ఆర్‌ఓలకు సూపర్‌వైజర్లు తోడ్పాటు అందించాల్సి ఉంటుంది.

ఈ విధానాలు పాటించాలి..

కౌంటింగ్ కేంద్రాల వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్లు నిర్వహించాల్సిన విధులు, పాటించాల్సిన విధానాల గురించి ఎన్నికల సంఘం స్పష్టంగా తెలియజేసింది.

- ఓట్ల లెక్కింపు వద్ద కౌంటింగ్ ఏజెంట్లతో పిచ్చాపాటిగా మాట్లాడకూడదు.
- స్ట్రాంగ్ రూమ్ నుంచి తెచ్చిన ఈవీఎం పెట్టెలకు సీల్ పరిశీలించిన తరువాతే వాటిని టేబుళ్ల వారీగా దించాలి.
- 17సీ ఫారం–1, కంట్రోల్ యూనిట్ నంబర్, పోలింగ్ స్టేషన్ నంబర్లు సరిపోల్చుకోవాలి.
- ఆ తరువాత కంట్రోల్ యూనిట్‌ను బ్యాలెట్ యూనిట్‌కు కనెక్ట్ చేసి స్విచ్ ఆన్ చేయాలి.
- సిస్టమ్ డిస్‌ప్లే అయేంత వరకు వేచి చూడాలి. ఆ తరువాత టోటల్ బటన్‌ను ప్రెస్ చేసి 17సీ ఫారం–1తో సరిపోలిందా లేదా చూడాలి.
- ఆ తరువాత కంట్రోల్ యూనిట్ అడ్రస్ ట్యాగ్ తొలగించాలి. పై కవర్ తీసి, వేసిన సీళ్లను తొలగించిన తరువాత 'రిజల్ట్ బటన్' ప్రెస్ చేయాలి.
- అందులో అభ్యర్థుల వారీగా పోలైన ఓట్లను 17సీ ఫారం–2లో నమోదు చేయాలి. ఆ ఫారాన్ని కార్బన్ పేపర్ ద్వారా రెండు కాపీలు ఉండేలా చూడాలి.
- ఓట్ల నమోదు అనంతరం అందులో ఏజెంట్ల సంతకం తీసుకోవాలి. ఒక ప్రతిని తమ వద్ద ఉంచుకుని, అసలు ప్రతిని 17సీ ఫారం–1కు పిన్ చేసి రో–ఇన్‌చార్జ్‌కు అందజేయాలి.

వీవీప్యాట్‌లు ఇలా లెక్కించాలి

- నియోజకవర్గంలో ఎంపిక చేసిన 5 పోలింగ్ కేంద్రాలకు చెందిన వీవీ ప్యాట్‌లను ఒకదాని తరువాత ఒకటిగా లెక్కించాలి.
- వీవీ ప్యాట్ స్లిప్‌లను సంబంధిత ట్రేలో ఉంచాలి. పూర్తయిన తరువాత 25 చొప్పున కట్టగా కట్టాలి. స్లిప్‌లు చిన్నవిగా ఉంటాయి కాబట్టి జాగ్రత్తగా వ్యవహరించాలి.
- వీవీ ప్యాట్ కౌంటింగ్ అనంతరం ఆర్‌ఓ పరిశీలిస్తారు. కౌంటింగ్ ప్రక్రియపై ఆర్‌ఓ సంతృప్తి చెందిన తరువాత స్లిప్‌లను సంబంధిత బాక్స్‌లో ఉంచి, విధుల్లో ఉన్న ఏఆర్‌ఓకు అప్పగించాలి.

అది ఎన్డీయే కమిషన్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థులు అనంత, విశ్వేశ్వరరెడ్డి, వీరా, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు

- తాడిపత్రి ఘటనలో పోలీసుల వైఫల్యం
- ఎన్నికల కమిషన్ చర్యలను తప్పుపట్టిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు

అనంతపురం కార్పొరేషన్: బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ కాస్తా ఎన్డీయే కమిషన్‌గా మారిపోయిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు విమర్శించారు. పోలీసుల వైఫల్యం కారణంగానే తాడిపత్రిలో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని స్పష్టం చేశారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ అనంతపురం, ఉరవకొండ, శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థులు అనంత వెంకటరామిరెడ్డి, వై.విశ్వేశ్వరరెడ్డి, వీరాంజనేయులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యలను ముక్తకంఠంతో తప్పుపట్టారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన అధికారం చేజిక్కించుకోవాలని ఎత్తుగడతో ముందుకెళ్లాయన్నారు. కూటమిగా ఏర్పడ్డాక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్‌ను ఎన్డీయే తన గుప్పిట్లోకి తీసుకుందని ఆరోపించారు. దీని కారణంగానే రాష్ట్రంలో అరాచకశక్తులు చెలరేగిపోయాయన్నారు. తాడిపత్రిలో 274 పోలింగ్ కేంద్రాలకుగాను 134 సమస్యాత్మకమైనవని గుర్తించినా.. ఆ కేంద్రాల్లో ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో అల్లర్లు చోటు చేసుకున్నాయన్నారు. సాక్షాత్తు నూతన ఎస్పీ పర్యవేక్షణలో పోలింగ్ రోజునే ఎమ్మెల్యే పెద్దారెడ్డి కారుపై రాళ్ల దాడి జరిగిందన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఏ బూత్ వద్దకు వెళ్లినా.. టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఏఎస్పీ రామకృష్ణ తారసపడ్డారని, దీన్ని బట్టి చూస్తే ఎన్నికలు పక్కా పథకం ప్రకారం నిర్వహించినట్లు తెలుస్తోందన్నారు. ట్రాక్టర్‌లో రాళ్లు తీసుకొచ్చి పెద్దారెడ్డి ఇంటిపై దాడి చేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారన్నారు. ఈ ఘటనపై స్పందించిన ఎన్నికల కమిషన్ (ఈసీ) జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, పట్టణ సీఐ మురళీకృష్ణలను బాధ్యులను చేసి సస్పెన్షన్ విధించిందన్నారు. తాడిపత్రి అల్లర్లు, అరెస్టులపై లోతుగా విచారణ చేపట్టాలని ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు.

పథకం ప్రకారమే కూటమి అడ్డదారులు..

ఎలాగైనా గెలవాలని ఎన్నికల కమిషన్ అండతో కూటమి నేతలు అడ్డదారులు తొక్కారని ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా దాడులు, అల్లర్లు జరిగాయన్నారు. కూటమి డైరెక్షన్‌లో అధికారుల బదిలీలు, నియామకాలు జరిగాయని, ఇందుకు ఎన్నికల కమిషన్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు మాట్లాడుతూ తాడిపత్రిలో ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై జరిగిన దాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఓటమి భయంతోనే టీడీపీ దౌర్జన్యానికి పాల్పడిందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా మాట్లాడుతూ తాడిపత్రిలో ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. తాడిపత్రి ఘటనపై లోతుగా విచారణ చేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మేయర్ వసీం, పార్టీ అనంతపురం, హిందూపురం నియోజకవర్గాల డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్ రాగే పరుశురాం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సైఫుల్లాబేగ్, సీపీ వీరన్న, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు, నాయకులు ధనుంజయ యాదవ్, కార్పొరేటర్ గురుశేఖర్ బాబు పాల్గొన్నారు.

24 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

- నేటి నుంచి రిజిస్ట్రేషన్లు
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



లోలూరులో విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఖరీఫ్ పంటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తనకాయల పంపిణీ ఈ నెల 24 నుంచి చేపట్టనున్నట్లు కలెక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. శనివారం నుంచే విత్తన కాయల కోసం రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. విత్తన పంపిణీ అంశంపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మతో కలిసి ఏడీఏ, ఏఓ, బ్యాంకర్లు, తదితర వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 24వ తేదీ నుంచి విత్తనకాయల పంపిణీ సజావుగా జరిగేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి రైతుకూ విత్తన కాయలు అందించాలన్నారు. పంపిణీ ప్రక్రియలో ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా, అవకతవకలకు ఆస్కారం ఇవ్వకుండా పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. పంపిణీ రోజుకు అందుబాటులో ఉండేలా ప్రాసెసింగ్ ప్లాంట్ నుంచి ఆర్‌బీకేలకు విత్తనకాయను ముందస్తుగానే తరలించి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఏపీ సీడ్స్ డీఎం వ్యక్తిగతంగా ఈ బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. పంపిణీ ప్రక్రియను కంట్రోల్ రూమ్ నుంచి మానిటర్ చేయాలని ఏపీ సీడ్స్ డీఎంను, జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు.

రైతు కోరిన రకం విత్తనాలే ఇవ్వాలి..

రైతు కోరిన రకం విత్తనకాయలనే ఇవ్వాలని కలెక్టర్ కచ్చితమైన ఆదేశాలిచ్చారు. ఆర్‌బీకేల్లో ఏడీఏలు, వ్యవసాయ అధికారులు సమావేశాలు నిర్వహించి రైతుకు ఏ రకమైన విత్తనకాయలు కావాలో తెలుసుకుని 19లోగా నివేదిక ఇవ్వాలని చెప్పారు. వానలు కురుస్తున్న నేపథ్యంలో ఆర్‌బీకేల్లో విత్తనకాయలను జాగ్రత్తగా నిల్వ చేయాలని సూచించారు. సీసీఆర్‌సీ కార్డులు మరింతమంది రైతులకు అందించేలా చూడాలని చెప్పారు. వారికి బ్యాంకుల నుంచి పంట రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహులు, ఏపీ సీడ్స్ డీఎం సుబ్బయ్య, ఏఓ రాకేష్, ఏడీఏలు,ఏఓలు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో మానిటరింగ్ సెల్..

సబ్సిడీ విత్తనకాయల పంపిణీ పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో సీడ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విత్తన పంపిణీలో రైతులకు ఏవేని సమస్యలు ఉంటే కలెక్టరేట్‌లోని మానిటరింగ్ సెల్ 08554- 232922, 08554-231922కు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు.

రైతులకు పంపిణీ ఇలా..

- అర ఎకరం వరకు 30 కిలోల సంచి ఒకటి.
- అర ఎకరం నుంచి ఎకరా వరకు 2 సంచులు.
- ఎకరం.. అంతకు మించి ఉంటే 3 సంచులు .

విత్తనకాయ రకాలు, ధర..

- కె–6, టీసీజీఎస్–1694 విత్తన వేరుశనగ కాయల 30 కిలోల సంచి పూర్తి ధర రూ.2,850. ఇందులో సబ్సిడీ రూ.1,140 పోగా రూ.1,710 చెల్లించాలి.
- కదిరి లేపాక్షి (కె–1812) రకం విత్తన వేరుశనగకాయల 30 కిలోల సంచి పూర్తి ధర రూ.2,610. ఇందులో సబ్సిడీ రూ.1,044 పోగా రూ.1,566 చెల్లించాలి.

81,832 క్వింటాళ్ల విత్తనాల కేటాయింపు..

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్–2024లో రైతులు పంటలు సాగు చేసేందుకు సబ్సిడీపై అందజేసే విత్తనం సిద్ధమవుతోంది. జిల్లాకు వివిధ రకాల పంటలకు సంబంధించి 81,832 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించారు. ఇందులో వేరుశనగకు అగ్రస్థానం దక్కింది. వేరుశనగ 76,710 క్వింటాళ్లు, కందులు 2,300 క్వింటాళ్లు, విత్తన వరి 1,600 క్వింటాళ్లు, ఉలవలు 700 క్వింటాళ్లు, జీలుగ 200 క్వింటాళ్లు, పిల్లిపెసర 25 క్వింటాళ్లు, జనుము 7 క్వింటాళ్లు, అలసంద 106 క్వింటాళ్లు, పెసర 85 క్వింటాళ్లు, మినుములు 46 క్వింటాళ్లు, కొర్రలు 50 క్వింటాళ్లు, రాగులు 4 క్వింటాళ్లు కేటాయించారు. వేరుశనగకు 40 శాతం, జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలపై 50 శాతం రాయితీ ఇవ్వనున్నారు.

విత్తన వేరుశనగ సేకరణ వేగవంతం

శింగనమల: విత్తన వేరుశనగ సేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని లోలూరు వద్దనున్న సాయి సీడ్స్ ఎంటర్‌ప్రైజెస్ గోడౌన్‌లో విత్తన వేరుశనగ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడారు. నిర్దేశిత గడువులోపు విత్తన సేకరణ పూర్తి చేయాలన్నారు.

సబ్సిడీ విత్తన బ్యాగులు పెంచాలి

పామిడి: సన్నకారు రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తన వేరుశనగ బ్యాగుల సంఖ్య పెంచాలని ఎద్దులపల్లి రైతులు కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరారు. శుక్రవారం ఎద్దులపల్లిలో ట్రైనీ కలెక్టర్ వినూత్నతో కలిసి కలెక్టర్ పర్యటించారు. తొలుత రైతు భరోసా కేంద్రంలో నిల్వ చేసిన విత్తన వేరుశనగను పరిశీలించారు. మండలానికి కే–6 రకం విత్తన వేరుశనగ 1,600 క్వింటాళ్లు కేటాయించినట్లు ఏఓ డీ లీనా వసుంధర కలెక్టర్‌కు వివరించారు. అనంతరం రైతు పవన్‌కుమార్ సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు వీరాంజనేయులు, ప్రతాప్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తిప్పారెడ్డి, ఆదినారాయణ తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సన్నకారు రైతులకు ఎకరాకు 3 చొప్పున ఐదు ఎకరాలకు 15 ప్యాకెట్ల విత్తన వేరుశనగ కేటాయించాలని కోరారు.

క్లుప్తంగా

ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడిగా రామానాయక్

- ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసనాయక్


రామానాయక్


శ్రీనివాసనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఫెడరేషన్ జిల్లా నూతన కౌన్సిల్ సమావేశం జరిగింది. నిబంధనల మేరకు అధికారుల అనుమతితో జిల్లా అధ్యక్షుడు ఎ.రవీంద్ర అధ్యక్షతన, ఎన్నికల పరిశీలకుడు ఎ. విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా పీవీ ప్రసాద్, అధ్యక్షుడిగా రామా నాయక్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసనాయక్, ఉపాధ్యక్షుడిగా ఎస్.రామాంజనేయులు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సి. పోతలయ్య, అదనపు కార్యదర్శిగా డి.ఆంజనేయులునాయక్, జిల్లా సబ్ కమిటీ సభ్యులుగా వజీర్‌బాషా, సాయినాథ్ రెడ్డి, బహేశ్వర, రామకృష్ణ, రమేష్ రెడ్డి, మద్దిలేటప్ప, అశోక్‌నాయక్, నాగార్జున, నారాయణరెడ్డి నరసింహులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కులశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి దిబ్బలు పడి కూలీ మృతి


మృతుడు గాజుల రాజశేఖర్

గుమ్మఘట్ట: మండలంలోని గలగల గ్రామానికి చెందిన గాజుల రాజశేఖర్ (41) అనే వ్యక్తిపై మట్టి దిబ్బలు పడి శుక్రవారం మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. గలగల గ్రామానికి చెందిన రాజశేఖర్, భాగ్యమ్మ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాజశేఖర్ కూలీ పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. గ్రామ సమీపంలో ఉన్న ఆర్.కొత్తపల్లి చెరువులోని ఇసుకను ఎద్దుల బండిలో తరలించేందుకు వెళ్లాడు. అడుగున ఉన్న ఇసుకను తవ్వుతుండగా పైన్నున్న మట్టిదిబ్బలు ఒక్కసారిగా మీద పడడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు మట్టిదిబ్బలను తొలగించేలోగా మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టుగోవిందరెడ్డి మృతుడి కుటుంబానికి సానుభూతిని తెలిపారు.

కళాఖండాలకు నిలయం

- 'అనంత'లో రూ.7.5 కోట్లతో మ్యూజియం ఏర్పాటు
- ఆకర్షించే విగ్రహాలు, ఆదిమానవుని కాలం నాటి పనిముట్లు

అనంతపురం కల్చరల్: మ్యూజియంలు అకడమిక్ విలువతో కూడిన వినోదానికి మూలంగా పనిచేయడమే కాదు సాంస్కృతిక వారసత్వం, చారిత్రక కళాఖండాల సంరక్షణను ప్రోత్సహించడంలో ఎంతో సహాయపడతాయి. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని (ఐఎండీ) ప్రతి సంవత్సరం మే 18న జరుపుకుంటారు. ఏ సంస్కృతిలోనైనా మ్యూజియంల ప్రాముఖ్యతను హైలైట్ చేయడానికి ఈ రోజును పాటిస్తారు. మ్యూజియంలు సాంస్కృతిక మార్పిడి, సంస్కృతుల సుసంపన్నం, ప్రజల మధ్య పరస్పర అవగాహన, సహకారం, శాంతి అభివృద్ధికి ముఖ్యమైన సాధనాలు.

అందమైన కట్టడాలలో ఒకటి..

ఆదిమానవుడు ఉపయోగించిన రాతి పనిముట్లు, మట్టిబొమ్మలు బౌద్ధ, జైన రాతి కాంస్య ప్రతిమలు, వివిధ రాజవంశాలకు చెందిన అపురూప వస్తువులతో 'అనంత' చరిత్ర వెరసి విజ్ఞానం .. వినోదం ఆవిష్కరించేలా జిల్లా కేంద్రంలో సర్వాంగ సుందర కట్టడం ఏర్పాటైంది. పురాతన వస్తువులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాన్ని జోడిస్తూ రాష్ట్రంలోనే అందమైన కట్టడాలలో ఒకటిగా నిలచిన ఈ మ్యూజియం భవంతి అందరిని ఆకర్షిస్తోంది. చరిత్రకు దర్పణంగా నిలిచే అధునాతన భవంతి విశేషాలు జిల్లా వాసుల ముంగిటకు రెండు నెలల కిందట మంత్రి ఆర్కే రోజా పురావస్తు శాఖాధికారులతో కలిసి ప్రారంభించారు. 'మ్యూజియం డే' లో నేపథ్యంలో అనంతపురం లోని మ్యూజియంలో శనివారం ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నారు.



అనంతపురం నగరంలో ఏర్పాటు చేసిన అధునాతన మ్యూజియం


పురాతన మట్టి పాత్రలు

సందర్భం - నేడు అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం

అనంత మ్యూజియం ప్రత్యేకతలివే...

జిల్లా కేంద్రంలోని ఆదిమూర్తినగర్‌లో రూ.7.5 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అత్యంత అద్భుతంగా పురావస్తుశాఖ వారు నిర్మించారు. పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మ్యూజియం పేరిట రూపుదిద్దుకున్న ఈ భవంతిలో జిల్లా సంస్కృతి, వారసత్వ సంపద, చరిత్రను చాటేలా వినూత్నమైన రీతిలో విజ్ఞాన వినోదాల మేళవింపుగా అధునాతన మ్యూజియం తయారైంది. ఇక్కడ నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇంటరాక్టివ్ డిస్‌ప్లే, టచ్ స్క్రీన్ ద్వారా జిల్లాలోని ప్రసిద్ధ క్షేత్రాల విశేషాలు, చారిత్రాత్మక స్థలాలు, జైన, బౌద్ధ అవశేషాలను తిలకించే ఏర్పాటుతో పాటు దాదాపు 1000 వస్తువులను పొందుపరిచారు. ముఖ్యంగా మూడు అంతస్తుల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన సముదాయంలో వేల ఏళ్ల నాటి పనిముట్లు, మట్టి బొమ్మలు, అజంతా, చుగ్‌తాయ్, డెక్కన్, రాజస్థానీల ఆధునిక చిత్రలేఖనాలు, బంగారు, వెండి నాణేలు, కవచాలు, పిస్టల్స్, కత్తులు, డాళ్లు, ఫిరంగులు చూసే అవకాశం కల్పించారు.



రాయదుర్గంలో లభించిన మహావీరుని విగ్రహం, 16వ శతాబ్దానికి చెందిన దేవతామూర్తుల విగ్రహాలు

వేడుకల్లో పాల్గొనండి



నూతనంగా నిర్మించిన మ్యూజియం హాలులో శనివారం ఉదయం మ్యూజియం డే వేడుకలు నిర్వహిస్తున్నాము. ఈ అద్భుతమైన కట్టడాన్ని తిలకించేందుకు చిన్నారులకు ఉచిత ప్రవేశం ఏర్పాటు చేశాము. కేంద్ర గ్రంథాలయం, ఇంటాక్ వారి సహకారంతో సాగే కార్యక్రమంలో చరిత్ర ప్రేమికులు, కవులు, రచయితలందరూ భాగస్వాములు కావాలి. ఘనమైన చరిత్ర కలిగిన 'అనంత' ప్రత్యేకతను చాటే విధంగా ఏర్పాటైన మ్యూజియంను విద్యార్థులు సందర్శించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. **– రజిత, సహాయ సంచాలకులు, జిల్లా పురావస్తుశాఖ**

రైళ్లపై రాళ్ల దాడి కేసులో ఇద్దరి అరెస్టు

అనంతపురం సిటీ: కాచిగూడ – బెంగళూరు మధ్య తిరిగే వందేభారత్ రైలుతో పాటు ముంబై – కోయంబత్తూరు మధ్య తిరిగే కుర్లా ఎక్స్‌ప్రెస్ రైలుపై రాళ్లతో దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులను ఎట్టకేలకు అరెస్టు చేశారు. మార్చి నెల 28న కాచిగూడ నుంచి బెంగళూరుకు బయలుదేరిన వందేభారత్ రైలుపై రాళ్ల దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ నెల 8న ముంబై – కోయంబత్తూరు మధ్య నడిచే కుర్లా ఎక్స్‌ప్రెస్‌పై కల్లూరు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేసిన విషయం విధితమే. ఈ రెండు కేసుల్లో అనంతపురం ఆర్‌పీఎఫ్–జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో పురోగతి సాధించారు. పామిడి కల్లూరుకు చెందిన షేక్ దూద్‌వలి, షేక్ జిలానీ రాళ్ల దాడికి పాల్పడినట్లు గుర్తించారు. ఆర్‌పీఎఫ్ సీఐ రవిప్రకాశ్, ఎస్ఐ మధుకర్ చారి తమ సిబ్బందితో వలపన్ని వారిని అరెస్టు చేశారు.

రక్తపోటును నిర్లక్ష్యం చేయొద్దు

- డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: రక్తపోటును నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. ప్రపంచ హైపర్ టెన్షన్ దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకూ ర్యాలీ జరిగింది. బీపీని సైలెంట్ కిల్లర్ అని పిలుస్తారన్నారు. హైబీపీతో గుండె ఆరోగ్యం, స్ట్రోక్స్, మూత్రపిండాల వైఫల్యం వంటి వాటిని ప్రభావం చూపుతాయన్నారు. రక్తనాళాల్లో పీడనం చాలా ఎక్కువగా ఉన్నప్పుడు (140/90 లేదా అంతకంటే ఎక్కువ) అధిక రక్తపోటు కింద పరిగణిస్తారన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, మద్యం, పొగాకు మానేసి, ఒత్తిడి లేకుండా జీవించాలన్నారు. అనంతరం అసంక్రమిత వ్యాధుల కార్యక్రమాధికారి డాక్టర్ నారాయణస్వామి బీపీ లక్షణాల గురించి విపులంగా తెలియజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుజాత, డాక్టర్ అనుపమ జేమ్స్, డాక్టర్ మహేంద్ర, ఓబులు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, పరిపాలనాధికారి గిరిజా మనోహర్, డెమో ఉమాపతి, త్యాగరాజు, గంగాధర్, ఎస్ఓ మహమ్మద్ రఫి, విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, ఎన్‌సీడీ సిబ్బంది శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

మాతా శిశు మరణాల నియంత్రణకు కృషి

అనంతపురం మెడికల్: మాతా, శిశు మరణాల నియంత్రణకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గత నెలలో జిల్లాలో చోటు చేసుకున్న మాతా, శిశు మరణాలపై సంబంధిత వైద్యులు, సిబ్బంది సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గర్భిణీని 12 వారాల్లోపు రిజిస్ట్రేషన్ చేయించి, ఆమెకు అన్ని రకాల వైద్య పరీక్షలు, సేవలను అందించాలన్నారు. ఏ తల్లి ప్రసవం అనంతరం అధిక రక్తస్రావంతో మరణించకూడదన్నారు. ప్రతి గర్భిణీని పరీక్షించాలని, ప్రమాదకర లక్షణాలున్న వారిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం జరిగేలా, 108ను వినియోగించుకునేలా ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెలా అధిక సంఖ్యలో ప్రసవాలు చేయాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి, గైనకాలజిస్టు డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ అరుణలత, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శంకర్‌నారాయణ, ఎంపీహెచ్ఈఓ లక్ష్మణ్ణ, ఎంపీహెచ్ఎస్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

సిజేరియన్లు తగ్గించాలి

అనంతపురం మెడికల్: 'నిబంధనలకు విరుద్ధంగా సిజేరియన్లు చేయకూడదు. సిజేరియన్లు తగ్గించి సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి' అని ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులను డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వైద్యులతో డీఎంహెచ్‌ఓ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఇష్టారాజ్యంగా సిజేరియన్లు చేసిన వైద్యులపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణీ స్త్రీల ప్రసవ సమయంలో సిజేరియన్ ద్వారా 30 నుంచి 40 శాతం మాత్రమే చేయాల్సి ఉందన్నారు. సిజేరియన్ చేయడానికి గల కారణాలు వైద్యశాఖకు పంపాలన్నారు. ముఖ్యంగా హైరిస్క్ సాధారణ ప్రసవానికి పూర్తీ ఇబ్బంది ఉన్నటువంటి గర్భిణులకు మాత్రమే సిజేరియన్ ద్వారా ప్రసవాలు చేయాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే నోటీసులు జారీ చేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరోగ్యశాఖ స్టాటిస్టికల్ ఆఫీసర్ మహమ్మద్ రఫి, డెమో ఉమాపతి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఉప డెమో త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ సిక్సర్స్, ఫ్యామిలీ క్లబ్ జట్ల గెలుపు

అనంతపురం: అనంతపురం క్రికెట్ లీగ్–2లో భాగంగా శుక్రవారం జరిగిన ఇండియన్ సిక్సర్స్, యునైటెడ్ చాంపియన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇండియన్ సిక్సర్స్ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియన్ సిక్సర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. టి.మహేందర్‌రెడ్డి 34 బంతుల్లో 48 పరుగులు (నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్) , ఎం. రాజ కుళ్లాయప్ప 36 బంతుల్లో 43 పరుగులతో (2 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన యునైటెడ్ ఛాంపియన్స్ 19.2 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌట్ అయింది. బీఎస్ వినయ్‌కుమార్ కేవలం 20 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీయడంతో ఇండియన్ సిక్సర్స్ జట్టు 26 పరుగుల తేడాతో గెలుపొందింది. బీఎస్ వినయ్‌కుమార్‌కు 'మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.



వినయ్‌కుమార్‌కు మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న దృశ్యం

- ఆర్డీటీ–బీ గ్రౌండ్‌లో దినేష్ గ్రానైట్స్, ఫ్యామిలీ క్లబ్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో ఫ్యామిలీ క్లబ్ తొలుత బ్యాటింగ్ చేసింది. 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 188 పరుగులు చేసింది. బి. యోగానంద 44 బంతుల్లో 57 పరుగులు (ఆరు ఫోర్లు), రామమూర్తి 31 బంతుల్లో 42 పరుగులు, ఎస్కే ఇస్మాయిల్ 10 బంతుల్లో 21 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన దినేష్ గ్రానైట్స్ జట్టు 18.3 ఓవర్లకు 126 పరుగులకు ఆలౌట్ అయింది. డీబీ ప్రశాంత్ 22 బంతుల్లో 30 పరుగులు, ఖాదర్‌వలి 29 పరుగులు, పి. గిరినాథరెడ్డి 26 పరుగులు చేశారు. మహమ్మద్ ఆసీఫ్ మూడు వికెట్లు తీసి దినేష్ గ్రానైట్స్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. యోగానందకు మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

బాధ్యుడిని వదిలేసి ఇతరులపై వేటు

- తాడిపత్రి ఘటనలో బాధ్యుడైన ఏఎస్పీ సేఫ్‌జోన్
- డీఎస్పీ, సీఐలపై సస్పెన్షన్ వేటు
- ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విస్మయం

తాడిపత్రిరూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం తాడిపత్రిలో రెండు రోజుల పాటు జరిగిన అల్లర్లు, దాడులు, ప్రతిదాడులకు సంబంధించి ఎన్నికల సంఘం తీసుకున్న చర్యలు విమర్శలకు తావిస్తున్నాయి. శాంతిభద్రతలు అదుపుతప్పడానికి ఏఎస్పీ రామకృష్ణ బాధ్యుడని ఆరోపణలు పెల్లుబికిన నేపథ్యంలో ఆయన్ను కాకుండా డీఎస్పీ గంగయ్య, పట్టణ సీఐ మురళీకృష్ణను సస్పెండ్ చేశారు. ఎన్నికల సంఘం తీసుకున్న ఈ నిర్ణయం విస్మయం కలిగిస్తోంది. తాడిపత్రి డీఎస్పీగా గంగయ్య 2023 మే5న బాధ్యతలు స్వీకరించారు. మొదటి నుంచి వివాదాలకు దూరంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. ఆయన వచ్చినప్పటి నుంచి తాడిపత్రిలో రాజకీయ వివాదాలు, శాంతిభద్రతల సమస్య ఏర్పడలేదు. పోలింగ్ అనంతరం అల్లర్లను నియంత్రించేందుకు డీఎస్పీ గంగయ్య తన వంతు కృషి చేశారు. సిబ్బంది తక్కువగా ఉండటం టీడీపీ మద్దతుదారులు భారీగా ఉండటంతో ఏం చేయలేని పరిస్థితి. పట్టణ సీఐగా ఉన్న మురళీకృష్ణ తాడిపత్రికి వచ్చి ఏడాది కూడా కాలేదు. ఆయన కూడా వివాదాలకు దూరంగా ఉండేవారు. అల్లర్లను నియంత్రించడానికి సీఐ మురళీకృష్ణ ప్రయత్నించి రాళ్ల దాడిలో గాయపడ్డారు. వీరిద్దరూ ఎస్పీతో పాటు తాడిపత్రి ఎన్నికల ఇన్‌చార్జ్‌గా ఉన్న ఏఎస్పీ రామకృష్ణ పరిధిలో ఉండటంతో సొంత నిర్ణయాలు తీసుకొని అల్లర్లను నియంత్రించలేని పరిస్థితి. అల్లర్లకు బాధ్యులను చేస్తూ ఎన్నికల సంఘం తీసుకున్న చర్యల్లో ఎస్పీతో పాటు డీఎస్పీ, సీఐలు సస్పెండ్ చేశారు. అయితే ఏఎస్పీ రామకృష్ణ తప్పించుకోవడం బట్టి చూస్తే ఆయనకు చంద్రబాబుతో డైరెక్టు లింకు ఉందని, ఆ మేరకే తాడిపత్రికి ఎన్నికల ఇన్‌చార్జ్‌గా వేయించుకున్నారని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని ఓడించడానికి స్థానిక టీడీపీ నాయకులతో చేతులు కలిపారని , ఆ సంబంధాల ద్వారానే సస్పెండ్‌ను తప్పించుకొని ఉండవచ్చని ఎమ్మెల్యే పెద్దారెడ్డి చేసిన ఆరోపణలు నిజమేనా అన్న ప్రశ్నలు అందరిలో తలెత్తుతున్నాయి.

ప్రభుత్వ ఐటీఐలో 28న జాబ్‌మేళా

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 28వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ టి.నరేంద్రనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఐ అండ్ టీ కన్‌స్ట్రక్షన్ స్కిల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాలో 2022 తరువాత ఐటీఐ పాసైన వారు పాల్గొనాలని సూచించారు. ఫామ్ వర్క్ కార్పెంటరీ, మెషనరీ, బార్ బెండింగ్ అండ్ స్టీల్ ఫిక్సింగ్, కన్‌స్ట్రక్షన్ ఎలక్ట్రీషియన్, వెల్డింగ్, స్కాఫోల్డింగ్ ట్రేడ్, ప్లంబింగ్ శానిటరీ విభాగాల్లో పనిచేయడానికి మొత్తం 350 మందిని ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 28వ తేదీ ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

సిద్ధంగా టీసీసీ-2023 ఉత్తీర్ణత సర్టిఫికెట్లు

అనంతపురం ఎడ్యుకేషన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్–2023 పరీక్షల ఉత్తీర్ణత సర్టిఫికెట్లు సిద్ధంగా ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) బి.వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. 2023 జూలైలో జరిగిన డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్ టెక్నికల్ పరీక్షల్లో పాసైన వారి సర్టిఫికెట్లు అనంతపురం కమలానగర్‌లోని పాత డీఈఓ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పరీక్షల హాల్‌టికెట్, ఫలితాల కాపీ, ఆధార్‌కార్డ్ తీసుకునివచ్చి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని డీఈఓ సూచించారు.

రైల్వే సామగ్రి చోరీ కేసులో నిందితుల అరెస్టు

అనంతపురం సిటీ: గార్లదిన్నె మండలం కల్లూరు సమీపంలోని పాత క్వార్టర్స్ వద్ద ఉన్న రైల్వేకు సంబంధించిన పాత సామగ్రి చోరీ కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు అనంతపురం ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మధుకర్‌చారి తెలిపారు. గురువారం జరిగిన ఘటనకు సంబంధించి కల్లూరుకు చెందిన దూద్‌వలి, జిలానీతో పాటు ఆటో డ్రైవర్ నల్లబోతుల నాగరాజును అరెస్టు చేశామన్నారు. పాత సామగ్రి చోరీకి ఉపయోగించిన ఆటోను సైతం సీజ్ చేసినట్లు వివరించారు. అరెస్టు చేసిన నిందితులకు స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు వెల్లడించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి


రాయదుర్గం రూరల్: పట్టణంలోని శాంతినగర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన అరవా గంగమ్మ (68) మృతి చెందినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. రాత్రి కరెంట్ లేని సమయంలో ఈ ఘటన జరిగిందన్నారు. ఇంటి వద్దనే రోడ్డు పక్కగా నడుచుకుంటూ వెళుతున్న గంగమ్మను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. ఢీ కొన్న వాహనం ఆపకుండా వెళ్లిపోయిందన్నారు. కుమారుడు అరవా మైలారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తల్లిని చంపిన కుమారుడి అరెస్టు


వెంకటేశులును అరెస్టు చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండల పరిధిలోని వైసీపల్లిలో ఈ నెల 14న కుటుంబ కలహాలతో కొడుకు చేతిలో తల్లి దారుణంగా హత్యకు గురైంది. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేశారు. వివరాలు.... వైసీపల్లికి చెందిన వడ్డే సుంకమ్మ, రామదాసు భార్య, భర్తలు. వారి కుమారుడు వెంకటేశులు అనంతపురంలో భార్యతో పాటు ఉంటూ అప్పుడప్పుడూ గ్రామానికి వస్తుండేవాడు. ఈ నెల 14న వెంకటేశులు గ్రామానికి వచ్చాడు. అయితే సుంకమ్మ, రామదాసులు కుటుంబ కలహాలతో గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలోనే రామదాసు కాలికి గాయమైంది. నాన్నను గాయపరుస్తావా? అంటూ తల్లి సుంకమ్మ తలపై కొడుకు వెంకటేశులు కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అయితే ఘటనా స్థలం నుంచి నిందితుడు పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న నిందితున్ని శుక్రవారం కంబదూరు మండలం నూతిమడుగు వద్ద రూరల్ సీఐ నాగరాజు, కంబదూరు ఎస్ఐ, ఆంజనేయులు సిబ్బందితో కలసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


మృతుడు వేణుఆచారి

రాప్తాడురూరల్: ఆటో వేగంగా వస్తూ రోడ్డుదాటుకుంటున్న ఎనుమును ఢీ కొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఓ ప్రయాణికుడితో పాటు ఎనుము కూడా మృతి చెందిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున అనంతపురం రూరల్ మండలం పాములాయి గ్రామ సమీపంలో జరిగింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... గార్లదిన్నెకు చెందిన నారాయణస్వామి, వేణుఆచారి (66) మామా అల్లుళ్లు. ఉదయాన్నే పని మీద ఆటోలో అనంతపురం బయలుదేరారు. పాములాయి సమీపంలోకి రాగానే ఎనుము రోడ్డు దాటుకుంటోంది. గమనించని ఆటో డ్రైవర్ బీమా వేగంగా వచ్చి ఎనుమును ఢీ కొట్టాడు. దీంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో వేణుఆచారి మృతి చెందగా నారాయణస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని సర్వజన ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందిస్తున్నారు. ఆటోడ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఏఎస్ఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

అనంతపురం కల్చరల్: కాలజ్ఞాన తత్వవేత్త జగద్గురు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురు పూజా మహోత్సవం శనివారం ఘనంగా జరగనుంది. స్థానిక రాణీనగర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశేష పూజలు, పంచామృత, పుష్పాభిషేక అలంకారాలు, అఖండ దీప ప్రజ్వలన, సాయంత్రం నగరోత్సవం ఉంటాయని ఆలయ నిర్వాహకులు గురుప్రసాద్, కుర్లపల్లి రంగాచారి తెలిపారు. భక్తులందరూ పాల్గొని తీర్థప్రసాదాలు అందుకోవాలని సూచించారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఏపుగా పెరిగిన కంప చెట్లు

అనంతపురం రూరల్: అనంతపురం రూరల్ మండల పరిధిలోని చిన్నంపల్లి పంచాయతీ ఎస్సీ కాలనీలోకి వెళ్లే రహదారులు కంప చెట్లతో అల్లుకుపోయి ప్రమాదంగా మారాయి. రోడ్లకు ఇరువైపులా కంప చెట్లు ఏపుగా పెరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే చాలా మంది ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. అయినా పంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కంప చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

అనంతకు చేరుకున్న సైకిల్ యాత్ర



సైకిల్ యాత్రికుడికి స్వాగతం పలుకున్న వీహెచ్‌పీ సభ్యులు

అనంతపురం కల్చరల్: చిక్‌బళాపూర్ నుంచి శ్రీరాముని జన్మస్థానమైన అయోధ్య వరకూ కొనసాగుతున్న సైకిల్ యాత్ర శుక్రవారం అనంతకు చేరుకుంది. సైకిల్ యాత్ర చేపట్టిన భాను ప్రసాద్‌కు విశ్వహిందూ పరిషత్తు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. జై శ్రీరామ్ నినాదాల నడుమ అతనికి మార్గమధ్యంలో ప్రత్యేక వసతులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భానుప్రసాద్ అనే భక్తుడు శాంతి సందేశమందిస్తూ సనాతన ధర్మానికి ప్రతీకగా సైకిల్‌యాత్ర చేస్తున్నాడని తెలిపారు. అందులో భాగంగా అనంత నుంచి గుత్తి మీదుగా కర్నూలు చేరుకుంటాడన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సభ్యులు రంజిత్, రమణబాబు, నరేంద్ర, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

కలేకూరి ప్రసాద్‌కు నివాళి



కలేకూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐఎస్‌ఏ నాయకులు

అనంతపురం: కవి, రచయిత కలేకూరి ప్రసాద్ ఎగిసిన ఆత్మ గౌరవ పోరాట కెరటమని ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన అన్నారు. కలేకూరి ప్రసాద్ వర్ధంతిని పురస్కరించుకుని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఆయన చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవిత్వం అతనే. ప్రవహించే పాట అతనే. నడిపించే ఉద్యమం అతడే అన్నారు. నిరసనని జీవితంగా మార్చుకున్న కలేకూరి ప్రసాద్.. అదే నిరసనతో తన నిష్క్రమణ గీతాన్ని రాసుకున్నారని పేర్కొన్నారు. కలేకూరి ప్రసాద్ రాసిన కవితలు ఆదర్శంగా నిలిచిపోతాయని ప్రశంసించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఏ రాష్ట్ర నాయకులు అరుణ కుమార్, తిరుమలేష్, ఎర్రిస్వామి, పరుశురాం నాయక్, రాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాసవీమాత జయంతి



అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత, లోక పావని వాసవీమాత జయంతినిని శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారు. దివ్య మనోహరరూపం, కరుణాకటాక్ష వీక్షణాలతో భక్తులను అనుగ్రహిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి అత్యంత ఫలప్రదమని భక్తులు విశ్వసిస్తారు. గత ఐదు రోజులుగా సాగుతున్న నగర సంకీర్తన నేటితో ముగియనుంది. శనివారం ఉదయం నుంచే ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని కొత్తూరు, పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నరసింహులు, నాగరత్నం తెలిపారు. ఉదయం ప్రత్యేక అలంకార సేవల అనంతరం 9 గంటలకు గుత్తిరోడ్డు చౌడేశ్వరీ దేవస్థానం నుంచి 102 మంది కన్యలతో ప్రాచీన కళారూపాలతో కలశాల ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అనంతరం వాసవీ హోమం, అలంకార, అభిషేకాలు, మధ్యాహ్నం పూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు.



హ్యాండ్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్న యువకుడు



పీటీసీలో సందడి..

వేసవి సరదా..

ఆటలే ఆటలు



బ్యాడ్మింటన్ ఆడుతున్న యువతి



వ్యాయామం చేస్తున్న దృశ్యం



ఉత్సాహంగా జాగింగ్..



మైదానంలో చిన్నారుల ఆటలు

నగరంలో వేసవి సెలవులను పిల్లలు తెగ ఎంజాయ్ చేస్తున్నారు. పీటీసీ, పార్కులు, మైదానాలకు ఉదయం, సాయంత్రం వేళల్లో భారీగా తరలివెళ్తున్నారు. క్రికెట్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్ తదితర క్రీడలను ఉత్సాహంగా ఆడుతున్నారు. ఇక పార్కుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి సరదాగా వ్యాయామం చేస్తున్నారు. యువత సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తూ ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, అనంతపురం

రుణాల రెన్యూవల్‌కు అడ్డంకులు పెట్టొద్దు

కనగానపల్లి: లేనిపోని నిబంధనలు పెట్టి రైతుల పంట రుణాల రెన్యూవల్‌కు అడ్డంకులు సృష్టించొద్దని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం రైతు సంఘం జిల్లా నాయకులు మహదేవ్, కదిరప్ప రైతులతో కలసి మామిళ్లపల్లి గ్రామీణ బ్యాంక్, కనగానపల్లి స్టేట్‌బ్యాంకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. మొదట గ్రామీణ బ్యాంకు దగ్గరకు వెళ్లి రుణాల రెన్యూవల్ కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను మేనేజర్ ప్రదీప్ దృష్టికి తీసుకెళ్లారు. వన్‌బీ ద్వారా రెన్యూవల్ చేసుకోకుండా ప్రతి సర్వే నంబర్‌కు అడంగల్ కాపీలు కావాలని అడగటం, రైతుల పేర్లలో చిన్న చిన్న తప్పులకు అఫిడవిట్ కావాలని అడుగుతుండటంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిని సవరించుకుని రెన్యూవల్ చేయాలని ఎన్నిమార్లు చెప్పినా అలాగే చేస్తుండటంపై బ్యాంకు మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి రైతు సంఘం నాయకులకు సర్దిచెప్పారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా గతంలో ఉన్న నిబంధనలు ప్రకారమే రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని బ్యాంకు అధికారులకు సూచించారు. అనంతరం వారు కనగానపల్లి స్టేట్‌బ్యాంకు దగ్గరకు వెళ్లి రైతులతో మాట్లాడారు. వన్‌బీ, అడంగల్ కాపీలపై రెగ్యూలర్ తహసీల్దార్ సంతకాలు చేయించుకుని రావాలని బ్యాంకు అధికారులు చెపుతున్నారని తెలిపారు. తహసీల్దార్ సెలవులో ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు పేర్కొన్నారు. వీఆర్వోలు, డిప్యూటీ తహసీల్దార్ సంతకాల ద్వారా కూడా రెన్యూవల్ చేసుకోవాలని స్థానిక బ్యాంకు మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు మల్లికార్జున, నాగరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.



స్టేట్‌బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

రాప్తాడు: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయ గౌరవాధ్యక్షుడు గౌరవ ఎర్రిస్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకూ స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గంగలకుంట, రామినేపల్లి, గొల్లపల్లి, మరూరు, ఎం.చెర్లోపల్లి, ఎం.బండమీదపల్లి, అయ్యవారిపల్లి, ప్రసన్నాయపల్లి, లింగనపల్లి, బోమ్మేపర్తి, పుల్లలరేవు, గాండ్లపర్తి, జి.కొత్తపల్లి, బుక్కచెర్ల తదితర గ్రామాల నుంచి భక్తులు వందలాది మంది తరలివచ్చి స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అన్నదానం చేశారు. రాప్తాడు గ్రామ పెద్దలు, భక్త మండలి ఆధ్వర్యంలో ఉపన్యాసాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ గౌరవాధ్యక్షుడు గౌరవ ఎర్రిస్వామి మాట్లాడుతూ.. ఏటా గ్రామంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలు గ్రామంలో నిర్వహించడం వల్ల గ్రామానికి శాంతి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, వైఎస్సార్‌సీపీ రాప్తాడు గ్రామ పంచాయతీ అధ్యక్షుడు చిరుతల నాగేంద్ర, మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధామ, వైఎస్సార్‌సీపీ నాయకులు సాకే చంద్ర, జయన్న తదితరులు పాల్గొన్నారు.



వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు

గైనిక్ వార్డుల్లో సెక్యూరిటీ వైఫల్యం

- యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్న పురుషులు

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రిలోని గైనిక్ విభాగానికి సంబంధించి వివిధ వార్డుల్లో సెక్యూరిటీ వైఫల్యం కారణంగా పురుషులు తిష్ట వేస్తున్నారు. పసిపిల్లలకు పాలు ఇస్తున్న సమయంలోనూ బయటకు వెళ్లాలన్న ఆలోచన లేకుండా ఉంటున్నారు. ఎప్పటికప్పుడు నిలువరించాల్సిన సెక్యూరిటీ చేతులెత్తేస్తున్నారని కొందరు స్టాఫ్‌నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలతకు వారు ఫిర్యాదు చేశారు. గైనిక్ షెడ్డులో సెక్యూరిటీ ఏర్పాటు చేయలేదన్నారు. వార్డుల్లో ఉండకూడదని చెబితే తమపై బిర్రుగా చూడటం, గొడవలకు వస్తున్నారని స్టాఫ్‌నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఆడవాళ్లు ఉన్నారన్న ఆలోచన లేకుండా కొందరు వ్యవహరిస్తుండటం బాధాకరమన్నారు. దీనిపై స్పందించిన ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత మరోసారి ఇటువంటి పరిస్థితి రాకుండా అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ మేనేజర్ రసూల్‌కు సూచించారు.

గూడ్స్ వ్యాన్ బోల్తా

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై దుకాణాలకు సరుకులు సరఫరా చేసే వ్యాన్ (గూడ్స్ వ్యాన్) శుక్రవారం అదుపుతప్పి బోల్తా పడింది. వివరాలు.. అనంతపురం నగరానికి చెందిన ఓ వ్యక్తి సరుకులను వ్యాన్‌లో వేసుకుని పెనుకొండ వైపునకు బయలుదేరాడు. 44వ నంబర్ జాతీయ రహదారిపై చెన్నేకొత్తపల్లి దాటగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం జరగలేదు. అటుగా వెళ్తున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జాతీయ రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. బోల్తా పడిన వ్యాన్‌ను జేసీబీ సాయంతో పక్కకు తొలగించారు.



ఇష్టారాజ్యంగా గడ్డి తొలగింపు

అనంతపురం కార్పొరేషన్: నగర సుందరీకరణలో భాగంగా కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో నగరపాలక సంస్థ సిబ్బంది శుక్రవారం నగరంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందున్న డివైడర్ల మధ్యలో గడ్డి తొలగింపు పనులు చేపట్టారు. ఈ పనులు చేసే క్రమంలో ఏపుగా పెరిగిన గడ్డి ముక్కలు గాల్లో లేస్తూ.. అటువైపుగా వెళ్తున్న వాహనదారులు, పాదాచారులపై పడుతున్నాయి. పొరపాటున కంటికి తగిలితే కంటి చూపు పోయే ప్రమాదం లేకపోలేదు. ఇదే విషయాన్ని నగరపాలక సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ హార్టికల్చర్ లక్ష్మీప్రసన్న దృష్టికి తీసుకెళ్లగా.. మధ్యాహ్నం సమయంలో పనులు జరిగేలా చూస్తామని తెలిపారు.



ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు యంత్రంతో గడ్డిని తొలగిస్తున్న దృశ్యం

ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలి

కనగానపల్లి: ఆన్‌లైన్‌లో భూముల వివరాలు సక్రమంగా రాకపోవటంతో పంట రుణాల రెన్యూవల్‌కు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే వాటిని సవరించి ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు రెవెన్యూ అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. భూములు రీ సర్వే జరిగిన కొన్ని గ్రామాల్లో ఆన్‌లైన్ పోర్టల్లో వన్‌బీ, అడంగల్ కాపీలు రావడం లేదన్నారు. దీంతో రైతులు రెవెన్యూ, మీ–సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. వాటిని సరిచేసి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు మహదేవ్, కదిరప్ప, మల్లికార్జున, నాగరాజు పాల్గొన్నారు.

పోలింగ్ @ 89.88 శాతం



కనగానపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

- కనగానపల్లి మండలంలో గతం కన్నా పెరిగిన ఓటింగ్ శాతం
- భారీగా తరలివచ్చి ఓటుహక్కు వినియోగించుకున్న వైనం
- మెజారిటీపై ఎవరి ధీమా వారిది

కనగానపల్లి: మండలంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం గతంలో కన్నా బాగా పెరిగింది. మండల వ్యాప్తంగా ఉన్న 37 పోలింగ్ కేంద్రాల్లో 30,356 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఎన్నికల్లో 89.88 శాతం ఓటింగ్ నమోదైంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, యువకులు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు వేశారు. మండలంలో మొత్తం 33,771 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 15,591 మంది పురుషులు, 14,764 మంది మహిళలు ఓటు వేశారు.

మెజారిటీ మాకంటే మాకే..

మండలంలో ఓటింగ్ శాతం పెరగటంతో మెజారిటీపై రాజకీయ పార్టీల నాయకులు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా గత 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 1,500 పైగా ఓట్ల మెజారిటీ దక్కింది. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారంతా తమకే ఓట్లు వేశారని, ఈసారి కూడా మాకే మంచి మెజారిటీ వస్తుందని అధికార పార్టీ నాయకులు ధీమాగా ఉన్నారు. అయితే గతంలో మండలంలో జరిగిన ఏ ఎన్నికల్లో కూడా ఎవ్వరికీ 2 వేల పైగా మెజారిటీ రాకపోవటంతో ఏ పార్టీ అభ్యర్థి కూడా కనగానపల్లి మండలంపై పెద్దగా ఆశలు పెట్టుకోలేదని తెలుస్తోంది.

మండలంలో గ్రామాల వారీగా నమోదైన పోలింగ్ వివరాలు

గ్రామం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
కొండపల్లి	1	995	879	88.34
తూంచర్ల	2	1739	1485	85.39
సీఎన్ కోట	1	757	600	79.26
గుంతపల్లి	1	720	663	92.08
భానుకోట	1	1214	1073	88.38
వేపకుంట	2	1758	1565	89.02
మద్దెలచెరువు	2	2030	1850	91.13
శివపురం	1	1062	996	93.78
కేఎన్ పాళ్యం	1	1258	1112	88.39
నరసంపల్లి	1	886	805	90.85
సోమర వాండ్లపల్లి	1	453	421	92.93
పాతపాళ్యం	1	758	686	90.50
తగరకుంట	3	2553	2272	88.99
బద్దలాపురం	1	1270	1194	94.01
యలకుంట్ల	1	1078	933	86.54
నెమలివరం	1	535	498	93.08
ముత్తువకుంట్ల	2	2302	2108	91.57
కనగానపల్లి	4	3461	3078	88.93
రాంపురం	1	570	492	86.31
కోనాపురం	1	1171	1081	92.31
బాలేపాళ్యం	1	894	833	93.17
పర్వతదేవరపల్లి	1	717	642	89.53
ముక్తాపురం	1	1042	949	91.07
మామిళ్లపల్లి	2	1748	1573	89.98
కుర్లపల్లి	1	1120	1020	91.07
చంద్రశ్చర్ల	1	1099	1012	92.90
దాదులూరు	1	571	536	93.87
మొత్తం	37	33,771	30,356	89.88

వికసించిన మే పుష్పం



అనంతపురం కల్చరల్: కోవూరు నగర్‌లో నివాసముంటున్న నారపరెడ్డి ఇంట్లో మే పుష్పం వికసించింది. ఏడాదికి ఒకసారి మాత్రమే పూసే ఈ పుష్పాన్ని చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్న నారప్పరెడ్డి మాట్లాడుతూ.. తమ ఇంట్లో గత 20 ఏళ్లగా మే పుష్పాలు వికసిస్తున్నట్లు తెలిపారు. చుట్టుపక్కల వారు ఆసక్తిగా తిలకిస్తున్నారన్నారు.

రమ్యకృష్ణకు గురుశ్రేష్ట అవార్డు



రమ్యకృష్ణను అభినందిస్తున్న కళాకారులు

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన నాట్యాకళాకారిణి రమ్యకృష్ణ గురుశ్రేష్ఠ పురస్కారాన్ని అందుకున్నారు. రంగస్థల సకల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్‌లోని కాశీ పుణ్యక్షేత్రంలో మూడురోజుల పాటూ జాతీయస్థాయి శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు జరిగాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు అద్భుత అభినయంతో ఆకట్టుకున్నారు. అనంత తరఫున శ్రీ రాజరాజేశ్వరి పదాన్యాస నృత్యాలయానికి చెందిన నాట్యాచార్యులు రమ్యకృష్ణ 15 మంది శిష్యబృందం అందరినీ ఆకట్టుకునేలా నాట్య ప్రదర్శన చేశారు. చిన్నారులకు నటరాజ పురస్కారాలు అందించి అభినందించారు.

నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోండి



ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అక్రమంగా యూనిఫాం, పుస్తకాలు అమ్ముతున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు అడ్మిషన్స్ చేస్తున్నాయని మండిపడ్డారు. శుక్రవారం ఖాజా నగర్‌లోని నారాయణ కళాశాల వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే నారాయణ విద్యాసంస్థల మాఫియా ప్రారంభమైందన్నారు. కళాశాల పేరుతో ముద్రించిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్నారన్నారు. ఉన్నతాధికారుల స్పందించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దు, గిరి, సహాయ కార్యదర్శి సూర్య, భీమేష్, చందు, మహేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.